


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ | గురువారం 22-08-2024 | ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ | సంపుటి : 06 | సంచిక : 221 | పేజీలు : 4 | వెల : రూ 2-00

PUBLISHED : NIZAMABAD | THURSDAY 22 AUGUST 2024 | EDITOR : BYAGAL SRINIVAS | VOLUME : 06 ISSUE : 221 | PAGES : 4 Rs : 2.00

## కామారెడ్డి బంద్

కామారెడ్డి ఆగస్ట్21(ఆర్ఎన్ఎ)బంగ్లాదేశ్ లో హిందువులపై దాడిని ఖండిస్తూ కామారెడ్డి పట్టణ బంద్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సంపూర్ణంగా బంద్ కొనసాగుతుంది. ఈ బంద్ లో భాగంగా వర్తక వ్యాపార వాణిజ్య సంస్థలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు షాపింగ్ మాల్ లు పెట్రోల్ బంకులు, పలు వర్తక, వాజ్ణిజ్య దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ బంద్ కు ప్రజల నుంచి పూర్తిగా మద్దతు లభించింది. ఈ బంద్ కారణంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లింగం మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో హిందులపై జరుగుతున్న దాడులకు నిరసనగా నేడు కామారెడ్డి పట్టణ బంద్ కు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగిందని అన్నారు.

# ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్‌దాస్‌కు ఉత్తమ ర్యాంక్

### సత్తాకు ఇది నిదర్శనమని...అభినందించిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ,ఆగస్ట్21 ప్రపంచంలో అత్యుత్తమ కేంద్ర బ్యాంకర్‌గా వరుసగా రెండోసారీ ఎంపికైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఇది ఆయనలోని నాయకత్వానికి లభించిన గుర్తింపుగా కొనియాడారు. ఈ ఘనత సాధించిన ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌కు అభినందనలు. అది కూడా రెండోసారి. ఆర్‌బీఐలో ఆయన నాయకత్వానికి; ఆర్థిక వృద్ధి, స్థిరత్వాన్ని నిర్ధరించే దిశగా ఆయన చేసిన కృషికి ఇది గుర్తింపు అని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగ్‌జైన్ ఇచ్చిన ర్యాంకుల్లో శక్తికాంత దాస్‌కు అగ్రస్థానం దక్కింది. గ్లోబల్ ÷నాన్స్ సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్స్ 2024లో శక్తికాంత దాస్‌కు 'ఏ' రేటింగ్ లభించిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆర్‌బీఐ వెల్లడించింది. ఏ రేటింగ్‌ను ప్రపంచంలో ముగ్గురు కేంద్ర బ్యాంక్ గవర్నర్‌లకు ఇవ్వగా.. అందులో దాస్ అగ్రస్థానం పొందారు. ద్రవ్యోల్బణం, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు, ఆర్థిక స్థిరత్వం, వడ్డీ రేట్ల నిర్వహణ ఆధారంగా కేంద్ర బ్యాంకుల గవర్నర్లకు ఏ నుంచి ఎఫ్ వరకు గ్రేడ్‌లను కేటాయించారు. అద్భుత పనితీరుకు ఏ, అధ్వాన పనితీరుకు ఎఫ్ రేటింగ్ ఇచ్చారు. ఏ? రేటింగ్ పొందిన కేంద్ర బ్యాంకర్లలో డెన్మార్క్‌కు చెందిన క్రిస్టియన్ కెటెల్ థామ్‌సన్, స్విట్జర్లాండ్ గవర్నర్ థామస్ జే జోర్డాన్ ఉన్నారు.

# కాశ్మీర్ ఎన్నికలపై బిజెపి దృష్టి


### కిషన్‌రెడ్డి, రాంబాధవ్‌లకు ఎన్నికల బాధ్యతలు



న్యూఢిల్లీ,ఆగస్ట్21: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్‌ను బీజేపీ అధిష్ఠానం జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో మూడు దశలు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. సెప్టెంబర్ 18న తొలిదశ, 25న రెండోదశ, అక్టోబర్ ఒకటిన మూడో దశ ఎన్నికలు జరుగనుండగా.. అక్టోబర్ 4న ఫలితాలు వెల్లడవనున్నాయి. ఈ మేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ప్రకటన విడుదల చేశారు. జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలను ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించారని.. నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. మాధవ్ 2014-20 కాలంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. జమ్మూ కశ్మీర్, అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల రాజకీయ వ్యవహారాలను నిర్వహించే బాధ్యత ఆయనది. సెప్టెంబర్ 26, 2020న పునర్వ్యవస్థీకరణలో భాగంగా బీజేపీ అయనను ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించింది.

## జన్వాడ ఫామ్‌హౌజ్ కూల్చివేతపై స్టే నిరాకరణ

### కూల్చివేతలపై హైడ్రా పరిధిని ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఫాంహౌస్ కూల్చివేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించిన ఉన్నత న్యాయస్థానం.. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధి గురించి చెప్పాలని ఏఏజీ ధర్మాసనం సూచించింది. హైడ్రా కూల్చివేతలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఇప్పటి వరకు హైడ్రా ఎన్ని కట్టడాలు కూల్చివేసింది, ప్రతి కూల్చివేతలోనూ నిబంధనలు పాటించారా? దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని ఏఏజీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించారా? అని ప్రశ్నించింది. హైదరాబాద్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందని, ఆక్రమణలు ఎక్కువయ్యాయని ఏఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులను రక్షించడానికి హైడ్రా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకొని హైడ్రా పనిచేస్తుందన్నారు. స్థానిక సంస్థల ద్వారా నోటీసులు ఇచ్చిన తర్వాతే అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్నామని తెలిపారు. ఈ పిటిషన్‌కు విచారణర్హత లేదని, కొట్టివేయాలని కోరారు. 2014లో జన్వాడలో ఫాంహౌస్ ఏర్పాటు చేశారని, 2019లో ప్రదీప్ ఫామ్‌హౌజ్ కొనుగోలు చేసినట్టు పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు ఫాంహౌస్ ఎందుకు కూల్చాలనుకుంటున్నారు? ఇన్నేళ్లుగా అధికారులకు ఎఫ్‌టీఎల్ గుర్తుకు రాలేదా? అని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నోటిఫై చేస్తే ఆ వివరాలు ఇవ్వాలని సూచించింది. ప్రాథమికంగా నోటిఫై చేశామని.. తుది నివేదిక రూపొందించే పనిలో ఉన్నామని ఏఏజీ తెలిపారు. జన్వాడ ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన వివరాలు కూడా సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

# పారదర్శకంగా..వేగంగా భూసేకరణ

### ఏరోజుకారోజు...వివరాలు అందించాలి
### దక్షిణ ప్రాంతంలో భూసేకరణకు దిగాలి
### ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్ల తదితర పనులపై ఆరా
### ట్రిపుల్ ఆర్‌పై సమీక్షలో సిఎం రేవంత్ సూచనలు



హైదరాబాద్,ఆగస్ట్21(: రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం భూసేకరణను పారదర్శకంగా, వేగంగా చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నారు.. పనుల పురోగతి ఏంటనే దానిపై రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారం తనకు అందజేయా లన్నారు. ఆర్ఆర్ఆర్ ప్రగతిపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కలెక్టర్లు ఈ రహదారి విషయంలో రోజు వారీగా ఏం చేశారు..? ఏం పురోగతి సాధించారు..? దక్షిణ భాగంలో భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం,ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిరోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందజేయాలన్నారు. భూ సేకరణలోనూ పారదర్శకంగా వ్యవహరిం చాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి, ఆమన్‌గల్, షాద్‌నగర్,చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, అదే సమయంలో పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అన్నారు. తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలి. సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేడియల్ రోడ్లు,

ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి అనువుగా ఉండాలని, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు.

# రేవంత్ పాప పరిహారం కోసం ప్రార్థిస్తా

### రుణమాఫీ పేరుతో దేవుళ్లపై ఒట్టేసుకున్న సిఎం
### యాదాద్రిలో ప్రత్యేక పూజలు చేయిస్తానన్న హరీష్ రావు

హైదరాబాద్,ఆగస్ట్21( ): సీఎం రేవంత్ రెడ్డి చేసిన పాపం ప్రజలకు శాపం కాకుండా చూసి రక్షించాలని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ప్రార్థిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాప పరిహారం కోసం, తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం గురువారం యాదాద్రి దేవాలయం దర్శించుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులతో కలిసి పూజలు చేయబోతు న్నామని ఆయన చెప్పారు. ఈ పాపాత్ముడైన ముఖ్యమంత్రిని క్షమించు, తెలంగాణ ప్రజలపై దయ ఉంచు అని యాదగిరి నరసింహస్వామిని వేడుకుంటామమని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆగస్టు15 లోగా రైతులందరికి రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి మీద ఒట్టు పెట్టి మాట తప్పారు. రూ. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలు ఉన్నాయని డిసెంబర్ నెలలో చెప్పారు.

# జన్వాడ ఫామ్ హౌస్ లీజు మాత్రమే

### నాకు పసొంతంగా ఫామ్‌హౌజ్‌లు లేవు
### అది అక్రమమైతే దగ్గరుండి కూల్చేయిస్తా
### మంత్రుల ఫామ్ హౌజ్‌ల నుంచే కూల్చివేతలు సాగాలి
### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ డిమాండ్



హైదరాబాద్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ): జన్వాడ ఫామ్ హౌస్ అక్రమంగా ఉంటే కూల్చేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది కేవలం తాను లీజుకు మాత్రమే తీసుకున్నానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. కూల్చివేస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లో స్పందించారు. తన పేరుతో ఫామ్ హౌస్ లేదని ఆయన స్పష్టం చేశారు. తన మిత్రుడికి చెందిన ఫామ్ హౌస్‌ను తాను లీజుకు తీసుకున్నానని తెలిపారు. గత కొన్ని నెలలుగా తాను అక్కడే నివసిస్తున్నట్లు చెప్పారు. జన్వాడలోని ఈ ఫామ్ హౌస్ నిబంధనల ప్రకారం లేకుంటే తానే దగ్గరుండి కూలగొట్టిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు. ఎఫ్ టీ ఎల్ పరిధిలో ఈ ఫామ్ హౌస్ నిర్మించి ఉంటే.. దానిని కూల్చివేస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని కుండ బద్దలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, సీనియర్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కెవిపి రామచంద్రరావు, మహేందర్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ తదితరులకు ఫామ్ హౌస్‌లున్నాయన్నారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి ఫామ్ హౌస్ ఎక్కడ ఉందో కూడా తాను చూపిస్తానని ఈ సందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫామ్ హౌస్.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలా ఉందని కేటీఆర్ సందేహం వ్యక్తం చేశారు. పొంగులేటి సోదరుడు ప్రస్తుతం అదే ఫామ్ హౌస్‌లో ఉంటున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.. తన ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే నిర్మించారా? అంటూ కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లోని కానీ, ఎఫ్‌టీఎల్‌లో కానీ తనకంటూ ఎలాంటి ఫామ్ హౌజ్ లేదు.. మీరు చెప్తున్న ఆ ఫామ్ హౌజ్ తన స్నేహితుడిది అని కేటీఆర్ స్పష్టం చేశారు. తన స్నేహితుడి ఫామ్ హౌజ్ ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉంటే నేనే దగ్గర్నుండి కూలగొట్టిస్తా. నో ప్రాబ్లం.. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్నాను. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, పెద్ద పెద్ద కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతి ఏంది..? నా స్నేహితుడి ఫామ్ హౌజ్‌ను మరి జూమ్‌లు పెట్టి తీస్తున్నారు.. అవి సోషల్ మీడియాలో కనబడుతున్నాయి. కానీ చెరువుల్లో కట్టుకున్న మంత్రుల ఫామ్ హౌజ్‌ల సంగతి ఏంది..? చెరువుల్లో కట్టుకున్న బడా కాంగ్రెస్ నాయకుల ఫామ్ హజ్‌లు కూలగొట్టే దమ్ము హైడ్రాకు లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ వీళ్ళందరి ఫామ్ హౌజ్‌ల దగ్గరికి వెళ్ళి కూలగొడదాం. వీరితో పాటు రేవంత్ రెడ్డిది కూడా ఫామ్ హౌస్ ఉంది. సీఎం ఫామ్ హౌజ్ గురించి శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తాను చూసుకోండి. నా పేరు మీద ఫామ్ హౌజం ఉన్నట్లు మీడియాలో ఏవేవో కథనాలు రాస్తున్నారు. కానీ స్పష్టంగా చెబుతున్నా.. నా పేరు మీద ఏ ప్రాపర్టీ లేదు. నేను లీజు మీద ఉన్నాను. ఒక వేళ తప్పు జరిగితే.. దగ్గరుండి కూల్చివేయించేందుకు సహకరిస్తాను. ఇక హైడ్రానో.. అమీబానో ఉంది కదా.. దాని తీసుకొని అక్కడ్నుంచి నేరుగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నుంచి మొదలు పెడుదాం. వాళ్ల తమ్ముడు కూడా అక్కడే ఉన్నాడు. అన్నీ ఒక్కటే రోజు కూలగొడుదాం.. ప్రజలకు పారదర్శకంగా ఉందాం. ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్నా నాకు ఎలాంటి ఇబ్బంది, అభ్యంతరం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.ముందు మంత్రుల ఫామ్ హౌస్‌ల కూల్చివేతతోనే వీటిని ప్రారంభించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు జన్వాడలో ఫామ్ హౌస్ కూల్చవద్దంటూ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలైంది. బీఆర్ఎస్ నేత ప్రదీప్ రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నగర శివారుల్లో పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారు. వీటిపై హైడ్రా ఫోకస్ పట్టింది. ఈ ఫామ్ హౌస్‌లు నిబంధనల మేరకు నిర్మించారా? లేక 111 జీవోను ఉల్లంఘించారా? అనే కోణంలో ఓ వైపు హైడ్రా, మరోవైపు ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి.. వివరాలు సేకరిస్తున్నారు. ఓ వేళ నిబంధనలు పట్టించుకోకుండా నిర్మిస్తే... వాటిని కూల్చివేసేందుకు ఐపీఎస్ అధికారి ఎ.వి.రంగనాథ్ సారథ్యంలో 'హైడ్రా' తన పని తాను చేసుకొంటూ ముందుకు వెళుతుందనే ఓ చర్చ సైతం సాగుతుంది.

## సంపాదకీయం

గురువారం 22-08-2024

# నిగ్రహం కోల్పోతున్న నేతలు !

విగ్రహాల సంగతి ఎలా ఉన్నా..నేతలకు నిగ్రహం ఉండాలి. మాట్లాడేప్పుడు నిగ్రహంతో మాట్లాడాలి. ఏదిపడితే అది మాట్లాడడం సరికాదు. భాషను పరిమితి మేరకు ఉపయోగించాలి. మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్నప్పుడు కొంత నిగ్రహంగా మాట్లాడాలి. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం భాషను ఇష్టానుసారం ఉపయోగిస్తున్నారు. వాడరాని పదాలన్నీ వాడేస్తున్నారు. సరే ఎన్నికల ప్రసంగం కాబట్టి వదిలేద్దామని అంతా అనుకుంటారు. కానీ అధికారంలో ఉన్నా..విపక్షంలో ఉన్నా నేతలు తమ మాటల్లో తప్పులు, బూతులు, ఇతరత్రా వాడకూడని పదాలు దొర్లకుండా చూసుకోవాలి. ఎదుటివారి మీద ఎంతగా కోపం ఉన్నా..అందుకు అనుగుణంగానే భాషను ఉపయోగించాలి. ఈ విషయంలో దివంగత వాజ్‌పేయ్ ప్రసంగాలు ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఎప్పుడూ పరుషంగా మాట్లాడిన సందర్భాలు లేవు. విమర్శలను కూడా సుతిమెత్తగా చేసేవారు. ఒకవేళ ఎవరైనా తనపై విరుచుకు పడ్డా..ఆయన అంతకు మించిన సంయమనంతో సమాధానం చెప్పేవారు. ఒకవేళ పరుషపదజాలంతో ఎవరైనా దూషిస్తే..మీకు ఇది ఉచితం కాదని సున్నితంగా హెచ్చరిక చేసేవారు. మొన్నటి ఎన్నికల సమయంలో ఎపి సిఎంగా ఉన్న జగన్, ఆయన అనుచరులు కూడా బూతులు మాట్లాడారు. తాము పదవుల్లో ఉన్నామన్న జ్ఞానం లేకుండా మాట్లాడారు. ఇలాంటివి ప్రజలు గుర్తిస్తారు. అలాగే హర్షించరని కూడా గుర్తించాలి. ఇప్పుడు తెలంగాణలో విగ్రహాల గొడవ నడుస్తోంది. గతంలో కూడా ఇలాంటిదే నడిచింది. పాలకులకు విగ్రహాల మీద ఉన్న శ్రద్ధ.. ప్రజల సమస్యలపైన లేదు. తెలంగాణ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. ఇంకా వాటిని కాంగ్రెస్ గుర్తించనే లేదు. వాటిపైన దృష్టిని కాస్తా ఇప్పుడు విగ్రహాల మీదకు మరల్చారు. ఎదుటి వారితో సై అంటే సై అనేలా మాటల తూటాలు పేలుతున్నారు. తాజాగా తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం వ్యవహారం ఇప్పుడు దుమారానికి కారణమయ్యింది. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలను కున్నామని బిఆర్ఎస్ వాదిస్తోంది. కానీ అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. నిజానికి తెలంగాణ కోసం పోరాడిన, అమరులైన వారు ఎందరో ఉన్నారు. వారెవ్వరూ విగ్రహాలు పెట్టించుకునేంత స్థాయికి రాలేదు. ఎందుకంటే నేతలు వారి త్యాగాలను గుర్తించిన సందర్భాలు లేవు. కనీసం ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారిని కూడా గుర్తించలేదు. ఇదే సందర్భంలో ఇప్పుడు రాజీవ్ విగ్రహం పెట్టాల్సిన అవసరం లేదు. అయితే స్వామి భక్తి చాటుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఉంటుంది. విగ్రహాలు పెట్టడం లేదా పథకాలకు పేర్లు పెట్టడం ద్వారా కాంగ్రెస్ పెద్దలను ఎప్పుడూ కొలిచే పద్దతి ఒకటి ఉంది. కాంగ్రెస్‌లో ఇలాంటి పనులు చేస్తుండాలి. లేకపోతే అధిష్ఠానం కోపానికి గురికాక తప్పదు. కాంగ్రెస్‌లో నెహ్రూ వారసులను స్మరిస్తూ పోవాలి. రేవంత్ రెడ్డి కూడా ఇలా చేయాల్సిందే. చేయకుండా ఉండలేరు కూడా. అందుకే తెరపైకి రాజీవ్ విగ్రహం వచ్చి చేరింది. గతంలో వైఎస్ కూడా ఇలాగే చేశారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి ఎపిలో రాజధానిగా ఉన్న హైదరాద్ నెక్లెస్ రోడ్డును అందంగా తీర్చి దిద్దారు. పార్కులు కట్టారు. ఇలా ప్రసాద్ ఐ మాక్స్ పక్కన చక్కని సర్కిల్ ఏర్పాటు చేసి, పూలవనంగా తీర్చి దిద్దారు. వైఎస్ సిఎం అయ్యాక అక్కడ ఇందిరాగాంధీ విగ్రహం పెట్టారు. ఇప్పుడు అక్కడ ఆ విగ్రహం ఉంది. విమానాశ్రయానికి రాజీవ్ పేరు పెట్టారు. క్రికెట్ స్టేడియానికి కూడా రాజీవ్ పేరు పెట్టారు. ఇలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే స్వామిభక్తి చాటుకునేందుకు ఇలాంటి పనులన్నీ చేస్తూ పోవాలి. ఈ క్రమంలోనే ఇప్పుడు రేవంత్ వంతు వచ్చింది. అందుకే సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహం పెట్టాలని తనవంతుగా భక్తిని చాటుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ నిర్ణయాన్ని సహజంగానే బిఆర్ఎస్ వ్యతిరేకించింది. తాము మళ్లీ అధికారంలోకి రాగానే విగ్రహాన్ని తొలగిస్తామని, రాజీవ్ పేరు ఉన్న విమానాశ్రయానికి లోకల్ లీడర్ల పేరు పెడతామని కెటిఆర్ ఘాటుగానే హెచ్చరించారు. రాజీవ్‌కు తెలంగాణకు సంబంధమేమిటని ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రాజీవ్ జయంతి సభ వేదుకగా ఘాటు విమర్శలు చేశారు. రాజీవ్ విగ్రహం పెడితే తొలగిస్తామని కొందరు మాట్లాడుతున్నారు, 'చేతనైనే ఆ విగ్రహాన్ని టచ్ చేయండి.. అంతు చూస్తాం' అని సిఎం రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. అధికారం పోయినా బిఆర్ఎస్ నాయకుల్లో కొందరికి అహంకారం తగ్గడం లేదని కూడా మండిపడ్డారు. పనిలోపనిగాసచివాలయం ఎదుట కెసిఆర్ విగ్రహాన్ని పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న మీరు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని కూడా బిఆర్ఎస్‌ను ప్రశ్నించారు. పదేళ్లలో ఏనాడూ విగ్రహం పెట్టాలన్న ఆలోచన రాని వాళ్లకు ఈరోజు రాజీవ్ విగ్రహాన్ని పెడితే ప్రశ్నించే నైతిక హక్కు లేదని అన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం కూడా పెడతామని సిఎం రేవంత్ ప్రకటించారు. ఈ విగ్రహాన్ని సచివాలయం లోపలే పెడతామని కూడా స్పష్టం చేశారు.రాజీవ్ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తాం అంటూ..కొంచెం పరుష పదజాలంతోనే విమర్శలు చేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తామని హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు విచక్షణ కోల్పోయి అర్థం పర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం సామాజిక బహిష్కరణ చేస్తుందని హెచ్చరించారు. రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మంగళవారం ప్రారంభించాలని ముందుగా నిర్ణయం తీసుకున్నా మని, కానీ, ఇంకా కొన్ని పనులు మిగిలి ఉండటం మూలంగా దానిని వాయిదా వేసుకున్నామని తెలిపారు. రాజీవ్ గాంధీ విగ్రహం అమరవీరుల జ్యోతి పక్కన ఉండటం సముచితం అనికూడా సమర్థించుకున్నారు. అలాగే రాజీవ్ దేశానికి చేసిన సేవల గురించి కూడా ప్రస్తావించారు. చివాలయం ముందు దొంగలకు, తాగుబోతులకు స్థానం లేదని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి విమర్శలు కూడా చేశారు. ఇదే సందర్భంలో పలు విమర్శలు కూడా చేశారు. ఎన్నికల సమయంలో ఇలాంటి భాష వాడితే తప్పులేదు. కానీ ఇప్పుడు ఇలాంటి భాష అవసరం లేదు. అలాగే రాజీవ్ విగ్రహం కూడా అవసరం లేదు. సచివాలయం ముందు ఇంకెవరిదైనా... లేకపోతే ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారి విగ్రహం పెట్టివుంటే హుందాగా ఉండేది. తెలంగాణ ఆకాంక్షలకు అనుగుణంగా ఉండేది.

# మన్యం విప్లవ వీరుడు పండు పడాల్....!

### గుమ్మడి లక్ష్మీనారాయణ ఆదివాసి రచయితల వేదిక




కామారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 21 (లోకం తీరు)మన దేశానికి స్వాతంత్ర్యం లభించడం వెనుక ఎందరో త్యాగధనుల పోరాట స్ఫూర్తి దాగున్నది. ఈనాటి భారతీయుల స్వేచ్ఛా వాణి వెనుక రక్తాన్ని ధార బోసిన వీరులలో వెలుగులోకి రానివారు మరెందరో ఉన్నారు. వారందరి అలుపెరగని పోరాట ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. తెల్లదొరల సామ్రాజ్య, నిరంకుశత్వ, కుటిల, కుతంత్ర, కుట్రపూరిత, స్వార్థ విషకోరల నుంచి భరత మాతకు విముక్తి కల్పించడానికి పట్టువీడని పోరాటం చేశారు. అలా పోరాడిన వారి చరిత్ర బయటకు రాలేదు. కొందరి చరిత్ర మాత్రమే వెలుగు చూస్తోంది. ఇంకా కానరాని వీరుల్లో బోనంగి పండు పడాల్... ఒక ఆదివాసీ యోధుడు. బ్రిటిష్ నిరంకుశ పాలనలో గిరిజనులు అనుభవిస్తున్న దయనీయ పరిస్థితిని తొలగించి, గిరిజనుల జీవితాలలో వెలుగు నింపడానికి అల్లూరి సీతారామరాజుతో కలసి పోరాడిన ధీరుడు పడాల్.1922 నుంచి 1924 వరకు మన్యవిప్లవం..!రగిలించిన అల్లూరి అనుచరుల్లో 'గాం గంటన్నదొర, మల్లుదొరల తరువాతి చెప్పుకోదగిన స్థానం... బోనంగి పండు పడాల్ కి దక్కుతుంది. బోనంగి పండు పడాల్ నేటి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం గొందిపాకలు గ్రామ పంచాయతీకి చెందిన బోనంగి అందయ్య, బంగారమ్మ దంపతులకు 1890, ఆగస్టు 13న జన్మించారు. 22 ఏళ్ల వయస్సులో పడాల్ అదే గ్రామానికి చెందిన లింగయమ్మను వివాహం చేసుకున్నాడు. అప్పటికే బ్రిటిష్ పాలకుల దురాగతాలు పెచ్చుమీరుతున్న సమయంలోను అల్లూరి సీతారామరాజుతో పడాల్ కలిసి మన్యంలో సాయుధ పోరాటానికి శ్రీకారం చుట్టారు. అలా అల్లూరి పోరాటానికి పండు పడాల్ ఆకర్షితుడయ్యాడు. ఆయనను అనుసరించాడు. అల్లూరికి సహకారిగా ఉంటూ మన్యం పోరాటానికి కదం తొక్కారు. సాయుధ పోరాటంలో భాగంగా పోలీస్ స్టేషన్ల దాడుల్లో పండు పడాల్ అల్లూరితో కలిసి పోరాడారు. ప్రధానంగా 1922 సెప్టెంబరులో కృష్ణాదేవిపేట వద్ద బ్రిటిష్ సైనికాధికారులు హైటర్, క్లవర్టర్ల ను అంతమొందించిన దాడిలో పండు పడాల్ ప్రధాన భూమిక పోషించాడు. దీంతో బ్రిటిష్ పోలీసులు పండు పడాల్ ను ఆరాచకుల జాబితాలో చేర్చారు. ఆనాటి నుంచి అల్లూరి సీతారామరాజుతో పాటు ఆయన అనుచరుల్లో ఒకరైన పండు పడాల్ ని పట్టుకునేందుకు బ్రిటిష్ పోలీసులు కార్యాచరణ ప్రారంభించారు. దీంతో పండు పడాల్ అజ్ఞాత జీవితాన్ని కొనసాగించాల్సి వచ్చింది.1924, ఏప్రిల్ 7న అల్లూరి సీతారామరాజు మరణం...!అనంతరం పండు పడాల్ కోసం బ్రిటిష్ పోలీసులు గాలింపు చర్యలను వేగవంతం చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం పండు పడాల్ వివరాలు, ఆచూకి తెలిపిన వారికి వంద రూపాయలు బహుమానం ప్రకటించింది. అల్లూరి సీతారామరాజు చనిపోయిన కొద్ది రోజుల తర్వాత పండు పడాల్ తన స్వగ్రామం అయిన గొందిపాకలు గ్రామానికి వెళ్లాడు. అప్పటికే బ్రిటిష్ ప్రభుత్వం అతని కుటుంబ సభ్యులను చిత్రహింసలకు గురిచేస్తోంది. దీంతో పండు పడాల్ సోదరి(అక్క) రామాయమ్మ అతడిని భోజనానికి ఇంటికి పిలిచి బ్రిటిష్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. భోజనానికి వచ్చిన పండు పడాల్ని పోలీసులు 1924 జూన్ లో అరెస్టు చేశారు. పండు పడాల్ సుదీర్ఘకాలం జైలు జీవితాన్ని అనుభవించారు. బ్రిటిష్ పోలీసులకు పట్టుబడిన పడాల్ కు విశాఖపట్నం సెషన్స్ కోర్టు 1925, మే 11న మరణశిక్ష విధించింది. ఈ శిక్షను మళ్లీ యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. దీంతో రాజమండ్రి, కన్నూరు, తిరుచురాపల్లి, పాయంకోట మరియు మద్రాస్ జైలులో ఉంచి తర్వాత అక్కడి నుంచి అండమాన్ కు ఓడలో తీసుకుని వెళ్లారు. 1926లో పడాల్ని అండ మాన్ లో ప్రవాస శిక్షకు పంపించారు. నాటి నుంచి దేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు అండమాన్ సెల్యూలార్ జైలులో శిక్షను అనుభవించాడు.జైలు నుంచి విడుదలైన పండు పడాల్...!అండమాన్ లోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. విడుదలైన వెంటనే తహసీల్దార్ ద్వారా గొందిపాకలు లోనున్న అతని భార్య లింగాయమ్మను అండమాన్ రప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె నిరాకరించింది. దీంతో అండమాన్ లో పార్వతి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఐదుగురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. 1974 ఫిబ్రవరి 11న పండు పడాల్ అండమాన్ లోనే మరణించాడు. 1973లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ పడాల్ జీవిత చరిత్రను సేకరించింది. అప్పట్లో ఓ తెలుగు దినపత్రిక పడాల్ జీవిత చరిత్రను ప్రముఖంగా ప్రచురించింది. ఆయన పోరాటపటిమకు స్ఫూర్తిగా పడాల్ కుటుంబ సభ్యులు 2012, ఫిబ్రవరి 28న గొందిపాకలులో పడాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా ఆ గ్రామస్థులు పండు పడాల్ జయంతిని ఆగస్టు 13న ఘనంగా నిర్వహిస్తున్నారు. 1922 నుండి 1924 వరకు దాదాపుగా రెండేళు సాగిన మన్యం పోరాటంలో, ఎందరో వీరులు తమ జీవితాలను ధారపోశారు. తాము జైలు గోడల మధ్య చిత్రహింసలను అనుభవించి, స్వాతంత్ర్యాన్ని మనకు అందించిన పడాల్ వంటి వారెందరో గుర్తింపుకు నోచుకోకుండా జీవితాలు చాలించారు. ఆ వీరులందరి త్యాగఫలం అనుభవిస్తున్న సందర్భంలో అనామక యోధుడైనా పడాల్ పోరాట చరిత్రను భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉంది.

# సింగిల్ విండో పరిధిలోని రైతులకు పూర్తిగా ఋణ మాఫీ వర్తించలేదు -- మాజీ జెడ్పిటిసి పడగల రాజేశ్వరరావు





కామారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 24 (లోకం తీరు)కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని నాలుగు సింగిల్ విండోల పరిధిలోని రుణమాఫీకి అర్హత గల రైతులు 4613 మంది రైతులు ఉండగా అందులో కేవలం 1549 మందికి మాత్రమే రుణమాఫీ అయిందని సదాశివ నగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతులందరికీ రుణమాఫీ చేస్తున్నామని ఒకపక్క ప్రకటిస్తూనే మరో పక్క కేవలం 30 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసినట్లు రికార్డులను బట్టి తెలుస్తుందన్నారు 30% రుణమాఫీకే ప్రభుత్వం ముఖ్యమంత్రి సంబంధిత శాఖ మంత్రులు డబ్బా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బుధవారం మండలంలోని సహకార సంఘాల నుంచి రైతుల రుణమాఫీ వివరాలు తెలుసుకుంటే పై విధంగా మాపి వచ్చిందన్నారు. మండలంలోని పద్మాజివాడి సింగిల్ విండోలో 911 మంది రైతులకు రుణమాఫీ కావలసి ఉండగా కేవలం 269 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వచ్చిందన్నారు అలాగే సదాశివ నగర్ సింగిల్ విండో పరిధిలో ఒక వెయ్యి రెండు మంది రైతులకు రుణమాఫీ కావలసి ఉండగా కేవలం 230 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వచ్చిందన్నారు అడ్లూరు ఎల్లారెడ్డి సింగల్ విండో పరిధిలో 1300 మంది రైతులకు రుణమాఫీ కావలసి ఉండగా కేవలం 54 4 మాత్రమే రుణమాఫీ వచ్చిందన్నారు ఇక ఉత్తనూరు సింగిల్ విండో పరిధిలో 1400 మంది రైతులు కావలసి ఉండగా కేవలం 566 మందికి మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. దీన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వం ఏ మేరకు రుణమాఫీ చేసిందో అర్థం అవుతుందన్నారు. ఈ విషయమై సదాశినగరం మండల వ్యవసాయ అధికారి ప్రజాపతిని కలిసి రుణమాఫీ విషయం ప్రశ్నించగా కొన్ని పేర్లు ఆధార్ కార్డు మీద ఒకరకంగా బ్యాంకులో మరోరకంగా పేర్లు ఉండటం వల్ల కొంతమందికి మాఫీ రాలేదని వాటిని సరి చేస్తున్నామని తెలిపారు. ఏది ఏమైనా ప్రభుత్వం చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇతరుల మీద నిందలేసే బదులు రుణమాఫీ చేయాలనీ డిమాండ్ చేశారు. సదాశివ నగర్ మండల బీసీ నాయకులు కళాలి సాయ గౌడ్, గోకుల్ తండా కు చెందిన లింబాద్రి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు రైతు ధర్నాను విజయవంతం చేయాలి

### బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జలెందర్ రెడ్డి



ఎల్లారెడ్డి అగస్ట్ 21(లోకం తీరు):- రైతు రుణమాఫీ లో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నేడు బిఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి బీఆర్ ఎన్ పార్టీ మండల అధ్యక్షులు జలెందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ధర్నా కార్యక్రమంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులకు రుణమాఫీ అయ్యేవరకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి వంద శాతం రుణమాఫీ చేయిస్తామని చేసేంతవరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# వేగంగా విస్తరిస్తున్న మంకీపాక్స్

### దేశంలో అముందస్తు చర్యలకు దిగిన కేంద్రం

### కరోనా అంత ప్రమాదకారి కాదన్న ఆరోగ్య సంస్థ

న్యూఢిల్లీ,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ):మంకీపాక్స్ వేగంగా వ్యాపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతోంది. పొరుగుదేశాల్లోనూ కేసులు నమోదవడంతో... కేంద్రం మరింత అప్రమత్తమైంది. దాయాది దేశం పాకిస్తాన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. అంతేకాదు.. పాక్ ఆక్రమిత కశ్మీర్ లోనూ ఒక ఎంపాక్స్ కేసు వెలుగుచూసింది. సౌదీ నుంచి పీఓకే కి వచ్చిన ఒక వ్యక్తిలో మంకీపాక్స్ లక్షణాలు కనిపించాయి. దీంతో.. కేంద్రం హైలర్ట్ ప్రకటించింది. ఎయిర్‌పోర్టులు, దేశ సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు చేపడుతోంది. ఎంపాక్స్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఊరటనిచ్చే విషయం చెప్పింది. కోవిడ్‌లా... మంకీపాక్స్ ప్రమాదకర వైరస్ కాదని తెలిపింది. ఈ వైరస్ వ్యాపిని నియంత్రించే అవకాశాలు ఉన్నాయిని చెప్పింది. కోవిడ్ సమయంలో వ్యవహరించినట్టే.. ఎంపాక్స్ విషయంలోనూ అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని.. వైరస్ వ్యాప్తిని కట్టడి చేయగలిగితే.. ఎంపాక్స్‌ను కూడా తరిమేయొచ్చని చెప్పింది ప్రపంచ ఆరోగ్య సంస్థ. మంకీపాక్స్ లక్షణాలతో వచ్చే ప్రయాణికుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. దేశంలో ఎంపాక్స్ కేసులు బయటపడితే.. చికిత్స కోసం మూడు ఆస్పత్రులను నోడల్ వైద్య కేంద్రాలుగా ప్రకటించారు. వాటిలో ఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రి ఒకటి. రెండోది సఫ్దర్‌గంజ్ ఆస్పత్రి, మూడోది లేడీ హార్డింగ్ హాస్పిటల్. ఈ ఆస్పత్రుల్లో.. మంకీపాక్స్‌కు చికిత్స అందించనున్నారు. అందు కోసం ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రాల్లోనూ నోడల్ కేంద్రాలను గుర్తించి... ఎంపాక్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించింది. భారత్ దేశంలో గతంలో ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. అయితే... ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతున్న ఈ దశలో కొత్తగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గత ఏడాది జులై నాటికి.. దేశంలో 27 మంకీపాక్స్ కేసులు ఉన్నాయని... పార్లమెంట్‌లో నాటి కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సింగ్ బఘేల్ ప్రకటించారు. ఈ 24లో... 15 కేసులు ఢీల్లోలో... 12 కేసులు కేరళలో ఉన్నట్టు చెప్పారు. అయితే... ఇప్పుడు మళ్లీ వైరస్ విజృంభిస్తోంది. ఎంపాక్స్ ప్రమాదకరంగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ క్రమంలో.. దేశంలో మళ్లీ ఎంపాక్స్ కేసులు విజృంభించే అవకాశాలు ఉన్నాయి. అందుకే కేంద్రం అలర్ట్ అయ్యింది. వ్యాధి లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని... వైరస్‌ను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఫోకస్ పెట్టింది. దేశంలో వైరస్ వ్యాపి కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికుల ట్రావెల్ హిస్టరీని నమోదు చేయడం చాలా అవసరం. ముఖ్యంగా.. ఎంపాక్స్ కేసులు ఎక్కువగా ఉన్న దేశాల నుంచి వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వాళ్లలో ఎవరికైనా ఎంపాక్స్ లక్షణాలు అంటే... జ్వరం, ఒంటిపై దద్దర్లు వంటివి ఉన్నాయేమో టెస్ట్ చేయాలని. అందుకు.. ఎయిర్‌పోర్టుల్లో టెస్టింగ్ సెంటర్లు పెంచాలి. మంకీపాక్స్ సోకిన వాళ్లకు కనిపించే ముఖ్యమైన లక్ష్యం ఒంటిపై దద్దుర్లు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు, వెన్నునొప్పి, మనిషి బలహీనపడటం, రోగ నిరోధక శక్తి తగ్గడం వంటివి ఉంటాయి. ఒంటిపై దద్దుర్లు పండుగా మారి... చీముతో నిండిన గాయంగా మారుతుంది. పుండ్లు మానిపోయి కొత్త చర్మం ఏర్పడే వరకు.. ఈ వ్యాధి ఇతరకు వ్యాపించే అవకాశం ఉంటుంది. కొంతమందిలో ఒంటిపై దద్దుర్లు ముందుగా కనిపిస్తే... మరికొందరిలో మరో లక్ష్యం బయటపడుతుంది. వ్యాధి సోకిన వారికి సన్నిహితంగా ఉంటే... వారిలో వారం రోజుల్లో వైరస్ లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందిలో 21 రోజుల్లో కూడా కనిపించవచ్చు. వైరస్ సోకిన తర్వాత రెండు నుంచి నాలుగు వారాల పాటు.. వ్యాధి లక్షణాలు ఉంటాయి.

# అదుపులోకి రాని బంగారం ధరలు

### యధావిధిగా ధరల పెరుగదల

న్యూఢిల్లీ,ఆగస్ట్21 ): దేశంలో బంగారం ధరలు దూసుకుపోతున్నాయి. పెరిగేప్పుడు తారాజువ్వలా పెరుగతూ..తగ్గినప్పుడు తాబేలు నడకలా తగ్గుతున్నాయి. మొత్తంగా ట్యాక్స్ తగ్గినప్పుడు అమాంతంగా తగ్గినట్లు తగ్గినా పెరుగుదల మాత్రం ఆగడం లేదు. దీంతో బంగారం సామాన్యులకు అందుబాటులో లేదనే చెప్పాలి. ఇప్పటికే 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72వేలు దాటేసింది. అయితే గతకొన్ని రోజుల క్రితం తులం బంగారం ధర ఏకంగా రూ. 80 వేలమార్క్‌కు చేరువై దడ పుట్టిచ్చిన విషయం తెలిసిందే. ఒకానొక సమయంలో తులం బంగారం ధర రూ. లక్ష దాటడం ఖాయం అంటూ వార్తలు కూడా వచ్చాయి. అయితే దానికి భిన్నంగా బంగారం ధర క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా బుధవారం బంగారం ధరలో తగ్గుముఖం కనిపించింది. దేశంలోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో గోల్డ్ రేట్ తగ్గింది. దేశరాజధాని ఢిల్లీలో మంగళవారం 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 66,7400కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,790వద్ద కొనసాగుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 66,590గా ఉండగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,640 వద్ద కొనసాగుతోంది. ? ఇక చెన్నైలో ఈరోజు 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,590, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,640గా ఉంది. బెంగళూరు విషయానికొస్తే ఇక్కడ 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,590గా ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 72,640 వద్ద కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరల విషయానికొస్తే హైదరాబాద్‌లో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 66,590గా ఉండగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,640 వద్ద కొనసాగుతోంది. అలాగే విజయవాడతో పాటు విశాఖపట్నంలోనూను ఇవే ధరలు కొనసాగు తున్నాయి. ంగారం ధర తగ్గితే.. వెండి ధరలో మాత్రం పెరుగుదల కనిపించింది. బుధవారం కిలో వెండిపై రూ. 100 వరకు పెరిగింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీతో పాటు.. కోల్‌కతా, జైపూర్ వంటి నగరాల్లో కిలో వెండి ధర రూ. 87,100గా ఉంది. ఇక ముంబయి, పుణెలో కూడా కిలో వెండి రూ. 87,100 వద్ద కొనసాగు తోంది. అయితే.. చెన్నైతోపాటు హైదరాబాద్, విజయవాడ, విశాఖలో కిలో వెండి ధర గరిష్టంగా రూ. 92,100 వద్ద కొనసాగుతోంది.

## మండల కేంద్రంలో భారత్ బంధు విజయవంతం

కామారెడ్డి జిల్లా రాజంపేట అగస్టు 21 లోకంతీరుసుప్రీం కోర్టు ఎస్సి వర్గీకరణ తీర్పు పట్ల నిరసనగా రాజంపేట మండల కేంద్రంలో భారత్ బంద్ పిలుపులో భాగంగా శివాయిపల్లి, పొందుర్తి, ఆరేపల్లి, తలమడ్ల గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మరియు వాణిజ్య సంస్థలు బుధవారం బంద్ మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులుకంకణాలరమేష్, వర్గీకరణ పోరాట సమితి కన్వీనర్ ఎడ్ల రాజు, సుతారిసుధాకర్,రవిందర్,కృష్ణ,నాలుకస్వామి, పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సన్మానం




కామారెడ్డి జిల్లా రాజంపేట అగస్టు 21 లోకంతీరురాజంపేట పోలీసు స్టేషన్లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఏ ఎస్సై గంగారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ పండరి గౌడ్ లకు రాజంపేట పోలీసు సిబ్బంది శాలువాతో సన్మానించి విడుకోలు పలికారు. ఎ ఎస్సై గంగారెడ్డి ఎల్లారెడ్డి పోలీసు స్టేషన్ కి, హెడ్ కానిస్టేబుల్ పండరీ గౌడ్ కామారెడ్డి పోలీసు స్టేషన్ కు బదిలీ అయినట్లు ఎస్సై పుష్ప రాజ్ తెలిపారు.

## నాణ్యమైన వైద్య సేవలు అందించాలి





కామారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 21 (లోకం తీరు)రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు, కాళ్ల నొప్పులు ఉన్నాయని రోగులు తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న ఇన్వార్డ్, ప్రసవ గదులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల సమైక్య మహిళలు కలెక్టర్ కు పుష్ప గుచ్చం అందజేశారు. అనంతరం కలెక్టర్ కు రాఖీ కట్టారు. గ్రామ సమైక్య సంఘ సమావేశాలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వ భవనం ఇవ్వాలని మహిళలు కోరారు. ప్రభుత్వ భవనం గ్రామంలో ఖాళీగా ఉంటే మండల స్థాయి అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ మహిళలకు సూచించారు.

### కాలభైరవ ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి ప్రతినిధి,ఆగస్టు 21(లోకం తీరు)ఇసన్నపల్లి, రామారెడ్డి లోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్నిసందర్శించారు. ఆలయఉద్యోగులు పూర్ణకుం భంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాముఖ్యతను వేద పండితులు వివరించారు. ఆలయ ఉద్యోగులు కలెక్టర్కుశాలువాతోసన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధి కారి ప్రభు, ఉద్యోగులు శ్రీనివాస శర్మ, రాములు పాల్గొన్నారు.



# అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులు సురక్షితం





రామారెడ్డి ఆగస్టు 21 (లోకం తీరు)రామారెడ్డి మండల కేంద్రంలో బుధవారం కామారెడ్డి నుండి రామారెడ్డి వెళ్లే రహదారిలో జరిగిన ఘటన వివరాల్లోకి వెళితే గంగమ్మ వాగు ప్రాంతంలో మద్దికుంట గ్రామం నుండి కామారెడ్డి వెళ్తున్న ఆర్ అండ్ బి రోడ్డు పై నుండి ఆర్టీసీ బస్సు అదుపుతప్పడం జరిగింది. డ్రైవర్ యొక్క చాకచక్యంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ప్రమాదం ఏమి జరగలేదు. బస్సులో మొత్తం 108 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో 12 మంది మగవాళ్ళు మిగతా ఆడవాళు ఉన్నారు. ఇదే క్రమంలో మండల కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఈ యొక్క ప్రమాదాన్ని అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఆర్టీసీ డిపో మేనేజర్ కు ఫోన్ చేసి మరొక బస్సును తెప్పించి ప్రయాణికులను సురక్షితంగా పంపించగలిగారు. ఈ యొక్క ఘటన విషయంలో స్థానిక ఎస్సై నరేష్ తక్షణమే స్పందించి ఘటన స్థలానికి చేరుకొని సహాయ సహకారాలు అందించారు.

# డాక్టర్ లకు న్యాయవాదుల సంఘీభావం

### జిల్లా కేంద్రంలో న్యాయవాదులు, డాక్టర్స్ ల కొవ్వొత్తులతో ర్యాలీ







కామారెడ్డి జిల్లా ఆగస్టు 21 లోకంతీరు కలకత్తాలో మహిళా డాక్టర్ పై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని, అలాగే డాక్టర్లు చేస్తున్న నిరసనలకు సంగీభావంగా న్యాయవాదులు కామారెడ్డి పట్టణం లోని మున్సిపల్ కార్యాలయం నుండి ఇందిరాగాంధీ చౌరస్తా వరకు మంగళవారం రాత్రి క్యాండిల్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోలా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ కలకత్తాలో మహిళ డాక్టర్ పై జరిగిన సంఘటన చాలా హేయమైన చర్య అని అట్టి సంఘటనను బార్ అసోసియేషన్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇక ముందు డాక్టర్ లు తీసుకునే నిరసన కార్యక్రమానికి ఎల్లప్పుడూ సహాయ, సహకారలు అందిస్తామని, వాళ్ళు తీసుకునే నిరసన కార్యక్రమానికి మద్దతు ఉంటుందని, హత్యాచార దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోలా శ్రీకాంత్ గౌడ్, ఉపాధ్యక్షులు చింతల గోపి, సంయుక్త కార్యదర్శి మోహన్ రెడ్డి, అమృత రావ్, శంకర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సిద్దరాములు, దామోదర్ రెడ్డి, శ్యామ్ గోపాల్ రావ్, జయప్రకాశ్, ఇతర న్యాయవాదుల తో పాటు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రమణ, కార్యదర్శి అరవింద్ గౌడ్, జిల్లాలోని డాక్టర్స్ పాల్గొన్నారు.

# గంగమ్మ వాగు కల్వర్టు నిర్మాణం పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్







కామారెడ్డి జిల్లా రామరెడ్డి అగష్టు 21 లోకంతీరుజిల్లాలోని రామారెడ్డి మండల కేంద్రం సమీపంలో ఉన్న గంగమ్మ వాగు వద్ద కల్వర్టు పనులను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. కల్వర్టు నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఈఈ రవి శంకర్, డిఈ జలిగామ శ్రీనివాస్, ఏఈ రవితేజను ఆదేశించారు. కేజీబీవీ వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. రామారెడ్డి లోని కస్తూరిబా పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. వసతిగృహం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. కేజీబీవీలో చేపట్టిన మరమత్తు పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలు పరిశీలించారు. వసతి గృహం మైదానంలో పిచ్చి మొక్కలు ఉండడంతో వాటిని తక్షణమే తొలగించాలని అధికారులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడేళ్లుగా పదో తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధిస్తున్నారని మండల విద్యాధికారి యోసేప్, వసతి గృహం ప్రత్యేక అధికారిని వనిత తెలిపారు. విద్యార్థినిలను భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగాలు సాధిస్తారని కలెక్టర్ అడిగారు. ఇంజనీర్లు, కలెక్టర్, ఎస్పీ, ఆర్మీ, ఉపాధ్యాయుడు, కానిస్టేబుల్ వంటి ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్నామని విద్యార్థినిలు చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థీనులను గుర్తించి ప్రత్యేక బోధన చేపట్టాలని కలెక్టర్ ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సురేందర్, అడిషనల్ పిడి రామన్ రావు, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, తహసిల్దార్ సువర్ణ, ఏపీవో ధర్మారెడ్డి, కార్యదర్శులు క్రాంతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా...?





రామారెడ్డి, ఆగస్టు 21 (లోకం తీరు)రామారెడ్డి మండలం ఈసన్నపల్లి గ్రామంలో చాతర బోయిన పెద్ద గంగారాం నివాసిత గృహంపై 11 కెవి విద్యుత్, అదేవిధంగా గృహ అవసరాలకు ఉపయోగించే విద్యుత్ తీగలు చేయి లేపితే తగిలేవిధంగా ప్రమాదకరంగా ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదానికి పరాకాష్ట అయిన పట్టింపు లేని విద్యుత్ సిబ్బంది. ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన, రాతపూర్వకంగా దరఖాస్తు చేసిన పట్టించుకునే వారే లేరు. తద్వారా విద్యుత్ తీగలతో ఇంటికి వర్షాకాలం లో గోడలకు అర్థింగ్రావడంవలన షాక్ తగులుతున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. అంతేగాక ఇంటిలో ఉన్న టీవీ, ఫ్యాన్, ఫ్రిడ్జ్, లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు విద్యుత్ ఘాతంతో పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఇంటి పైనే వేలాడుతున్న తీగలుఇంటిపైకివెళ్లడానికికూడా భయంగా విద్యుత్ తీగలు, ఇకనైనా అధికారులు స్పందించిఇంటి పై ఉన్న విద్యుత్తీగల నుతొలగించవలసిందిగా కుటుంబసభ్యులుఆవేదన వ్యక్తం చేశారు.

## పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించిన కలెక్టర్-- ఆశిష్ సాంగ్వాన్





కామారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 21 (లోకం తీరు)పల్లె ప్రకృతి వనం లో చెట్లు దట్టంగా పెరిగి అల్లాదకరమైన వాతావరణం కనిపిస్తుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి లోని పల్లె ప్రకృతి వనాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. ప్రకృతి వనం చుట్టూ నడకదారిలో వెళ్లి వనంలో ఉన్న చెట్లను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. పండ్లు, ఔషధ మొక్కలు పెంచాలని గ్రామస్తులకు సూచించారు. ప్రస్తుతం మొక్కలు నాటడం వల్ల భావితరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయాలని చెప్పారు.

## స్వర్ణకార సంఘం మండల అధ్యక్షుడిగా నవీన్ కుమార్ చారి





ఎల్లారెడ్డి ఆగస్టు 21 (లోకం తీరు) : ఎల్లారెడ్డి మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా ఎస్ నవీన్ కుమార్ చారి ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గ వివరాలను ఆయన వెల్లడించారు. మండల స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శిగా సందీప్ చారి, కోశాధికారిగా శ్రీనివాస్ చారి, ఉపాధ్యక్షులుగా బాలచంద్రం చారి, భరత్ తేజ చారి, ఉప కార్యదర్శిగా ఈశ్వర్ చారి, విఠల్ చారి, ప్రకాష్ చారి, సోషల్ మీడియా ఇన్చార్జిగా నవీన్ చారి, కార్యవర్గ సభ్యులుగా రామచంద్ర చారి, వెంకటేశ్వర్లు చారి, సుదర్శన్ చారి, సంతోష్ చారి, అభిలాష్ చారి, బ్రహ్మం చారి, సలహాదారులుగా రామచంద్ర చారి, శ్రీనివాస్ చారి, సుగుణాకర్ చారి, వెంకట్ చారి, సత్యనారాయణ చారి, సాయిబాబా చారి, రాజు చారి, బ్రహ్మం చారిలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

## శ్రీశైలం జలాశయం వద్ద విరిగిపడ్డ కొండచరియలు .. తప్పిన ప్రమాదం

అమరావతి : నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయం వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. మండలంలో కురిసిన కుంభవృష్టి వర్షానికి రాత్రి కొండ చరియలు విరిగి పెద్ద బండరాళ్లు ఘాట్రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. రాత్రి కారణంగా రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం గమనించిన ప్రయాణికులు జిల్లా అధికారులకు సమాచారం అందజేయడంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాళ్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. రాత్రి నుంచి పరిసర ప్రాంతాల్లో ఎడతెరుపు లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. శ్రీశైలం జలాశయం దిగువన రహదారి మార్గంలో రోడ్డుకు అడ్డంగా కొండ చరియలు విరిగిపడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలోనూ పలుమార్లు కొండచరియలు విరిగిపడిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదాలు జరుగకముందే అధికారులు కొండచరియలు విరిగిపడక ముందే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సినిమా తీరు

## ముఫాసా 'మహేష్'.. ఏమన్నారంటే..

డిస్నీ రూపొందిస్తున్న "ముఫాసా: ది లయన్ కింగ్" అనే ప్రతిష్టాత్మక చిత్రానికి సూపర్‌స్టార్ మహేష్ బాబు తన వాయిస్‌ను అందించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా డిసెంబర్ 20 తెలుగులో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. డిస్నీ ఈ చిత్రాన్ని తెలుగులో మరింత బలంగా ప్రేక్షకులకు చేరవేయాలన్న ఉద్దేశంతో మహేష్ బాబును ముఫాసా పాత్రకు ఎంపిక చేసింది. ంఆఎఇఖీమోఇఓఇఔ మహేష్ బాబు ఈ సినిమాకు వాయిస్ ఓవర్ ఇవ్వడం తనకెంతో ప్రత్యేకమని, కుటుంబాన్ని ఎంతగానో ప్రేమించే తండ్రిగా ముఫాసా పాత్రలో మాట్లాడడం గొప్ప అనుభవంగా మారిందని పేర్కొన్నారు. "డిస్నీ చిత్రాలు నాకు ఎంతో ఇష్టం. ముఫాసా పాత్ర, తండ్రిగా తన కుమారుడిని మార్గదర్శనం చేయడమే కాకుండా, తన గుంపును సంరక్షించే రాజు అయినందున నాకు బాగా ఆకట్టుకుంది.నా కుటుంబం అంటే నాకు ఎంతో ప్రీతిగా ఉంటుంది. అందుకే ఈ డిస్నీ ప్రాజెక్ట్‌లో భాగం కావడం నాకు ఎంతో ప్రత్యేకంగా అనిపించింది. నా కుటుంబం, అభిమానులతో కలిసి తెలుగు వెర్షన్‌ను థియేటర్లో చూడటానికి ఎదురు చూస్తున్నాను" అని మహేష్ బాబు అన్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు బారీ జెన్కిన్స్ తెరకెక్కించగా, అనేక విభిన్న పాత్రలను ప్రాణం పోసేలా డిజైన్ చేశారు. లైవ్-యాక్షన్ ఫిల్మ్ మేకింగ్ టెక్నిక్‌తో పాటు ఫోటోరియల్ కంప్యూటర్ జనరేటెడ్ ఇమేజరీ ని మిళితం చేసి రూపొందించారు. తెలుగులో మహేష్ బాబు ముఫాసాగా వినిపించనుండగా, బ్రహ్మానందం పుంబా పాత్రలో, అలీ టిమోన్ పాత్రలో తమదైన శైలిలో ప్రేక్షకులను అలరించనున్నారు. డిస్నీ స్టూడియోస్ హెడ్బ బిక్రమ్ మాట్లాడుతూ, "ప్రతీ కథను ప్రేక్షకులకు మరింత దగ్గరగా తీసుకురావడమే మా లక్ష్యం. ముఫాసా పాత్ర ప్రేక్షకులకు స్ఫూర్తిదాయకం. తెలుగులో మహేష్ బాబు వాయిస్‌లో ఈ పాత్రను ప్రాణం పోసేలా చేయడం మా ఆలోచనకు మించిన ఆనందంగా ఉంది," అని చెప్పారు. ఈ చిత్రం చిన్నతనంలో అనాథగా మారిన ముఫాసా ఎలా రాజుగా ఎదిగాడో ఆ కథను చూపించనుంది. మహేష్ బాబు అందించిన డబ్బింగ్, ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ అవ్వడంలో కీలక పాత్ర పోషించనుందని భావిస్తున్నారు. ఈ చిత్రానికి లిన్-మాన్యుయెల్ మిరాండా సంగీతం అందించడం విశేషం. మహేష్ బాబు వాయిస్ ఓవర్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు ఇప్పటికే భారీగా ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.



## మళ్లీ అదే సీన్ రిపీట్.. చిన్న సినిమాలు పెద్ద విజయాలు

ఒకప్పుడు పెద్ద హీరోల సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సొంతం చేసుకున్న దాఖలాలు ఎక్కువ. చిన్న హీరోల సినిమాలు ఒక మోస్తరుగా ఆడేవి. కానీ ఇప్పుడు పెద్ద హీరోల సినిమాలకు ఏమాత్రం తగ్గకుండా చిన్న హీరోల సినిమాలు, కొత్త నటీనటులు నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను నమోదు చేస్తున్నాయి. ముక్కు మొహం తెలియని కొత్త నటీనటులు చేసిన సినిమాలు ఈ మధ్య కాలంలో భారీ విజయాలను సొంతం చేసుకున్న దాఖలాలు చాలానే ఉన్నాయి. ఇప్పుడు అదే సీన్ రిపీట్ అయ్యింది. కమిటీ కుర్రాళ్లు మరియు ఆయ్ సినిమాలు కొత్త వారితో రూపొందాయి. విడుదలకు ముందు పబ్లిసిటీ తో అందరి దృష్టిని ఆకర్షించారు. ఎంతటి పబ్లిసిటీ చేసినా కూడా కంటెంట్ లేకుంటే సినిమాలు తిరస్కరణకు గురి అయిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఆయ్ మరియు కమిటీ కుర్రాళ్లు మాత్రం మంచి కంటెంట్ తో ప్రేక్షకులను అలరిస్తున్నాయి. రవితేజ హీరోగా నటించిన మిస్టర్ బచ్చన్ తో పాటు, రామ్, పూరి కాంబోలో రూపొందిన డబుల్ ఇస్మార్ట్ సినిమాలు బరిలో ఉండగా ఈ చిన్న సినిమాలు నిలుస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. సినిమాల కంటే కూడా అధికంగా రోజు రోజు వసూళ్లు పెంచుకుంటూ ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తున్నాయి. విడుదల అయిన మూడు రోజుల్లోనే ఈ సినిమాలు బ్రేక్ ఈవెన్ ను సాధించాయి. కమిటీ కుర్రాళ్లు సినిమాను నిహారిక నిర్మించగా, ఆయ్ సినిమాను బన్నీ వాసు నిర్మించిన విషయం తెల్సిందే. ఈ రెండు సినిమాలు కూడా మెగా కాంపౌండ్ నుంచే రావడం విశేషం. భారీ ఎత్తున వస్తున్న ఈ సినిమాల కలెక్షన్స్ చూసి బాక్సాఫీస్ వర్గాల వారు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆయ్ సినిమా చాలా తక్కువ స్క్రీన్ ల్లో రిలీజ్ అయ్యింది. కానీ రోజులు గడుస్తున్నా కొద్ది స్క్రీన్స్ సంఖ్య పెంచుతూ వచ్చారు. ఇప్పటికే ఆయ్ తో విడుదల అయిన సినిమాలు ప్రేక్షకుల తిరస్కరణకు గురి అవ్వడంతో ఆ సినిమాల స్థానంలో ఆయ్ మరియు కమిటీ కుర్రాళ్లు ఇంకా కూడా పలు థియేటర్ లలో రన్ అవుతూనే ఉంది. ముందు ముందు ఈ సినిమాలు మరిన్ని వసూళ్లు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ వారం రాబోతున్న సినిమాల ప్రభావం ఆయ్ మరియు కమిటీ కుర్రాళ్లు వసూళ్ల పై ఉండే అవకాశం ఉంది.




## అయిదుసార్లు ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం.. అపార్ట్‌మెంట్‌లో శవమై తేలిన మేటి సైక్లిస్ట్



లాస్ ఏంజిల్స్: వెనిజులా దేశానికి చెందిన మేటి సైక్లిస్ట్ డానిలా లార్రియల్ చిరినోస్.. లాస్ వెగాస్‌లోని తన అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పద రీతిలో మృతిచెందారు. ఆగస్టు 16వ తేదీన ఆమె మృతదేహాన్ని గుర్తించారు. లాస్ వెగాస్‌లో హోటల్‌లో పనిచేస్తున్న ఆమె.. పనికి రాకపోవడంతో ఆమె కోసం వెతికారు. ఆగస్టు 11వ తేదీన చిరినోస్ మృతిచెంది ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆమె గొంతులో ఘన ఆహార పదార్థాలను గుర్తించారు. వాటి వల్ల ఆమెకు శ్వాస ఆడి ఉండదని భావిస్తున్నారు.ఒకప్పుడు వెనిజులా మేటి అథ్లెట్‌గా చిరినోస్‌కు గుర్తింపు ఉన్నది. ఆమె ఆ దేశం తరపున ఏకంగా అయిదు ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించింది. 1992 నుంచి 2012 వరకు సైక్లిస్ట్‌గా ఆమె మెగా క్రీడల్లో పాల్గొన్నది. 1992లో బార్సిలోనా, 1996లో అట్లాంటా, 2000లో సిడ్నీ, 2004లో ఏథెన్స్, 2012లో లండన్ గేమ్స్‌లో ఆమె ప్రాతినిధ్యం వహించింది. తన కెరీర్‌లో ఎన్నో పతకాలు గెలుచుకున్నదామె. 2002లో సెంట్రల్ అమెరికన్, కరీబియన్ గేమ్స్‌లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. 2003 పాన్ అమెరికన్ గేమ్స్‌లో రెండు సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నది. సైక్లింగ్ లోకంలో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది.వెనిజులా రాజకీయాలను మాజీ అథ్లెట్ తీవ్రంగా విమర్శించేది. హ్యూగో ఛావేజ్ అంటే ఆమెకు నచ్చదు. ఫేక్ రేసింగ్ డ్రైవర స్పాన్సర్‌షిప్‌తో ఛావేజ్ నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు ఆమె ఆరోపించింది. 2013లో నికోలస్ మాదురో బాధ్యతలు స్వీకరించడాన్ని కూడా ఆమె వ్యతిరేకించింది. దీంతో చిరినోస్‌పై వెనిజులాలో ఎంట్రీ బ్యాన్ విధించారు. మియామిలో ఊబర్ డ్రైవర్‌గా చేసింది. ఆ తర్వాత వెగాస్‌లో ఫుడ్ సర్వర్‌గా చేసింది.


## లోకల్ ధాబాలో ఫ్రెండ్స్‌తో చిల్ అవుతున్న ధోనీ.. పిక్స్ వైరల్




భారత క్రికెట్ జట్టు మాజీ సారథి ఎంఎస్ ధోనీ ఫ్యామిలీతో తన విలువైన సమయాన్ని గడుపుతున్నాడు. ధోనీ 2021లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పూర్తిగా ఐపీఎల్‌కే అంకితమయ్యాడు. ఐపీఎల్ మ్యాచ్‌లు మినహా మరే ఇతర మ్యాచుల్లోనూ ఆడటం లేదు. ఆ సమయంలో తన విలువైన సమయాన్ని ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో గడుపుతున్నాడు.అప్పుడప్పుడు సరదాగా తన బైక్స్, కార్లలో రాంచీ వీధుల్లో షికారు చేయడం, ఫ్రెండ్స్‌తో సరదాగా బయటకు వెళ్లడం వంటివి చేస్తున్నాడు. తాజాగా ధోనీ తన ఫ్రెండ్స్‌తో చిల్ అవుతున్న ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. రాంచీలోని ఓ లోకల్ ధాబా లో తన ఫ్రెండ్స్‌తో కలిసి లంచ్‌ను ఎంజాయ్ చేశారు. వారితో సరదాగా కాసేపు ముచ్చటించి టైమ్ స్పెండ్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.ఐపీఎల్‌లో కింగ్ మేకర్‌గా పేరొందిన ధోనీ 16వ సీజన్‌లో సీఎస్కేను మరోసారి చాంపియన్‌గా నిలిపాడు. అందరూ ఊహించినట్టే 17వ సీజన్‌కు ముందు తాల పగ్గాలు వదిలేశాడు. తన వారసుడిగా రుతురాజ్ గైక్వాడ్ ను ప్రకటించి వికెట్ కీపర్‌గా కొనసాగాడు. అయితే.. అతడు మరో సీజన్ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. 41 ఏండ్ల వయసులోనూ ఫిట్‌గా ఉన్న ధోనీ 18వ సీజన్‌లో కొత్త అవతారంలో చెన్నైకి అండగా నిలిచే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ

## ఆ హీరోకి అదొక్కటే స్వీట్ న్యూస్!

ఆగస్టు15 స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బాలీవుడ్ నుంచి 'ఖేల్ ఖేల్ మే', 'వేదా', స్త్రీ-2 చిత్రాలు రిలీజ్ భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. వీటిలో 'స్త్రీ-2' బ్లాక్ బస్టర్ అవ్వగా మిగిలిన రెండు చిత్రాలు ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకున్నాయి. అక్షయ్ కుమార్ ఖాతాలో 'ఖేల్ ఖేల్ మే'తో మరో ఫ్లాప్ మూవీ పడింది. అంతకు ముందు వరుస ఫ్లాప్ చిత్రాల గురించి మళ్లీ చెప్పాల్సిన పనిలేదు. రాజాసాబ్ రాఖీ సెలబ్రేషన్ ఇప్పటికే అక్షయ్ ఫ్లాప్ లను ఉద్దేశించి నెట్టింట పుంకాలు పుంకాలుగా కథనాలు వైరల్ అవుతున్నాయి. కిలాడీ ఫ్లాపు లు చూసి ప్రేక్షకులే అయ్యో పాపం అనే పరిస్థితి వచ్చేసింది. చేసిన సినిమా కనీస వసూళ్లు కూడా తేకుండా పోవడంతోనే ఈ రకమైన పరిస్థితి కనిపిస్తుంది. అక్షయ్ కుమార్ కూడా ఈవిషయంలో ఎంతో నిరుత్సాంలో కనిపిస్తున్నాడు. మరి వీటన్నింటి నుంచి కాస్తైనా ఉపశమనం ఏదైనా ఉంది? అంటే 'స్త్రీ-2' సక్సెస్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందులో వరుణ్ ధావన తో పాటు అక్షయ్ కుమార్ కూడా స్పెషల్ అప్పిరియన్స్ ఇచ్చారు. సినిమాలో వాళ్ల పాత్రకు మంచి గుర్తింపు దక్కింది. తొలి షో అనంతరం రివ్యూల్లో శ్రద్ధాకపూర్ సహా మెయిన్ స్ట్రీమ్ అందర్నీ ప్రశంశిస్తూనే అక్షయ్ పేర్లు కూడా చెబుతూ ప్రశం సించారు. దీంతో అక్షయ్ కుమార్ కి ఇది ఉపశమనా న్నిచ్చే విషయమే. రెండేళ్లు చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అనే మాట తప్ప కనీసం యావరేజ్ హిట్ అనే టాక్ కూడా ఏ సినిమాకి వినిపించలేదు. అలాంటిది 'స్త్రీ-2' సినిమా ఏకంగా వందల కోట్ల వసూళ్లతో దూసుకుపోతుంది.ాగం అవ్వడం అక్షయ్ కే కలిసొచ్చిన అంశంగా చెప్పాలి. ఒకవేళ స్త్రీ-2 కూడా బొల్తా కొడితే అక్షయ్ కుమార్ ఉన్నాడు ? కాబట్టే పోయింది అన్న నింద సైతం పడే అవకాశం ఉండేది. కానీ ఆ ఛాన్స్ ఇవ్వలేదు.




## అందానికే మరో అందం....






## మత్తులో బతుకు చిత్తు



ఇటీవల హైదరాబాద్‌లోని ఫిలిమ్‌నగర్ ప్రాంతంలో మాదక ద్రవ్యాలు భారీగా పట్టుబడ్డాయి. ఇద్దరు నిందితుల వద్ద నుంచి పోలీసుల 8 సీసాల మత్తు ద్రావణాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మత్తు ద్రావణంను సిగరేట్‌లో కలిపి తీసుకునేలా నిందితులు తయారు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఏపిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో మన్యం ప్రాంతాల్లోనూ తెలంగాణ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా అనంతరి ఏజెన్సీల్లో అక్రమంగా గంజాయి మొక్కలను మాదకద్రవ్యాలను సరఫరారా చేసే ముఠాలు గుట్టు చప్పుడు కాకుండా పెంచడం ఇటీవలే వెలుగులోకి వచ్చింది. ఇంజినీరింగ్ కాలేజీ పరిసర ప్రాంతాలలో పెద్ద ఎత్తున గంజాయి విక్రయాలు సాగుతున్నాయన్న నేపథ్యంలో పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా పరిధిలో గంజాయి విక్రయిస్తున్న 12 మందిని, గంజాయికి బానిసలుగా మారిన 139 మంది యువకులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్, విశఖ మన్యంలో హైదరాబాద్‌కు వాహనాలలో అక్రమంగా తరలిస్తున్న అంతరరాష్ట్ర గంజాయి ముఠా నుంచి 200 కేజీల గంజాయిని పోలీసుల బృందాలు స్వాధీనం చేసుకుంటున్న ఇలాంటి ఎన్నో సంఘటనలు మీడియాలో సంచనాలు సృష్టిస్తున్నాయి. మాదక ద్రవ్యాలు అతిపెద్ద సమస్యగా పరిణమించాయి. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడంతో ఉత్సాహంతో ఉరకలెత్తాల్సిన యువత, జవసత్వాలు సన్నగిల్లి యవ్వనంలోనే శారీరకంగా మానసికంగా నిర్వీర్యమైపోతున్నారు. దుర్వ్యసనాల బారిన పడుతూ యుక్త వయసులోనే అనారోగ్యానికి గురవ్వతున్నారు. శరీర అంతర్భాగం తూట్లు తూట్లుగా మారిపోవడంతో జీవచ్ఛవాల్లా జీవిస్తున్నారు. తులసి వనంలాంటి అడవ్ళలలో గంజాయి మత్తెక్కిస్తోంది రోజుల తరబడి మత్తులో ముంచెత్తే ఈ మహమ్మారి యువతను లక్ష్యంగా చేసుకుంటుంది. కళాశాలల్లో చదివి విద్యార్థుల్లో చాలామంది ఈ అలవాటుకు బానిసలవ్వతున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోకపోతే చేయిదాటే ప్రమాదం ఉంది. గంజాయి గుప్పు డ్రగ్ మాఫియాపై ప్రభుత్వాలు, పోలీస్ శాఖ ఉక్కు పాదం మోపుతున్నప్పటికీ, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా చైతన్యం కలిగిస్తున్నప్పటికీ మారుమూల ప్రాంతాల్లో గంజాయి భూతం యువతను పట్టి పీడిస్తోంది. విద్యార్థుల జీవితాలను మత్తులో ముంచేస్తుంది. తెలుగు రాష్ట్రాలలోని అడవి ప్రాంతాలు, అంతర రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో గంజాయి మాఫియా రెచ్చిపోతోంది. మారుమూల గ్రామాల్లోని యువతలో గంజాయి మత్తు ఆవహిస్తోంది. సులువ్వగా బ్బుల సంపాదనే ధ్యేయంగా యువకులను మత్తులో ముంచుతున్న గంజాయి ముఠాలు. మత్తుకు బానిసగా మారిన యువతను ఏజెంట్లుగా మార్చి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నాయి. గంజాయి, బిజినెస్ మాఫియాకు కాసులు పండిస్తుంటే బానిసైన యువత భవిష్యత్తును చిత్తు చేస్తోంది. తమ అక్రమ సంపాదన కోసం మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాల కళాశాలల విద్యార్థులకు గంజాయికి అలవాటు చేసి కోట్ల రూపాయలను దండుకుంటున్నారు. గ్రామల్లోని పాఠశాల విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు గంజాయికి అలవాటు పడటంతో లేత వయసులోనే విద్యార్థుల జీవితాలు చిక్కి శల్యమైపోతున్నాయి. ఇలా బానిసలుగా మారతారు మత్తుకు అలవాటు యువకులు పక్కవారిని చెడగొట్టేందుకు ఆ మత్తులో ఉండే ఆనందాన్ని రెట్టింపు చేసి చెప్పడం, అదేదదో కొత్తగా, ఆనందంగా ఉంటుందనే నెపంతో గంజాయి అలవాటుకు బానిసలవ్వతున్నారు యువకులు. మద్యంతో వచ్చే మత్తు కంటే రెండింతలు ఎక్కువగా ఉంటుందని అదో కొత్త కిక్కు అంటూ కొత్తవారిని అటువైపు తీసుకెళ్తుంటారు బానిసలుగా మారిన యువకులు. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినప్పుడు, ప్రేమలో విఫలమైనప్పుడు యువకులు గంజాయి సేవించే దిశగా దగ్గరయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుత సవజంలో చెడు వ్యసనాలను ప్రోత్సహించేవరి సంఖ్య పెరిగిపోతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.